క్లుప్తంగా

పేదలకు అన్నదానం



నిరాశ్రయులకు అన్నదానం చేస్తున్న ఉదయభాస్కర్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని రోడ్డు ప్రక్కన నివాసముంటున్న నిరాశ్రయులకు నగరానికి చెందిన ఉదయ భాస్కర్ బుధవారం అన్నదానం చేశారు. కొప్పరపు జనార్దన్ సాయంతో సేకరించిన భోజనాన్ని నగరంలోని పలు ప్రాంతాలు, కూడళ్లలోని నిరాశ్రయులకు పంచి పెట్టారు. దాతలు ముందుకు వచ్చి తమ వంతుగా తోడ్పాటు అందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

మొండి బకాయిదారులపై కొరడా



షోరూం యాజమాన్యంతో చర్చిస్తున్న కార్పొరేషన్ అధికారులు

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తిపన్ను చెల్లించకుండా మొండి బకాయిదారులుగా మిగిలిపోయిన వారిపై కొరడా ఝుళిపించేందుకు కార్పొరేషన్ అధికారులు సిద్ధమయ్యారు. స్థానిక చిన్నచౌక్ సాయిబాబా గుడి ఎదురుగా ఉన్న ఓ టైల్స్ షోరూంను బుధవారం సీజ్ చేసేందుకు అధికారులు యత్నించారు. ఎన్జీవో కాలనీలోని సరస్వతీ జూనియర్ కాలేజీ వారికి నోటీసు ఇవ్వగా వారు సోమవారం చెల్లించేందుకు అంగీకరించారు. లేని పక్షంలో సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర, ఆర్ఓ విజయ్‌భాస్కర్ గౌడ్, ఆర్ఐ విశ్వనాథరెడ్డి, అడ్మిన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడల పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఉప కులపతి విశ్వనాథకుమార్

కడప ఎడ్యుకేషన్ : డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బుధవారం కళాశాల అంతర విభాగం క్రీడల పోటీలు నిర్వహించారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య జి.విశ్వనాథకుమార్, కులసచివులు ఎస్.రాజేష్ కుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ టి.ఎస్.ప్రసాద్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా వీసీ విశ్వనాథకుమార్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఉత్సాహ పూరిత వాతావరణంలో వర్సిటీ విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. తొలిరోజు జరిగిన కబడ్డీ పోటీలలో ఆర్కిటెక్చర్ విభాగం, స్కాలర్ విభాగం విద్యార్థులు విజయం సాధించారు. క్రికెట్ పోటీలలో అప్లైడ్ ఆర్ట్స్ విభాగంపై ఆర్కిటెక్చర్ విద్యార్థులు విజయం సాధించారు. విజేతలను వర్సిటీ ఉన్నతాధికారులు అభినందించారు.

ఏఎస్‌డబ్ల్యూఓపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు పి. సాయిదత్త

కడప కార్పొరేషన్ : జమ్మలమడుగు ఎస్సీ హాస్టల్ ఏఎస్‌డబ్ల్యూఓ గురు ప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి.సాయిదత్త డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించి విద్యార్థిని ఆత్మహత్య చేసుకునేందుకు కారణమైన అధికారిపై చర్యలు తీసుకోకుండా ఉన్నతాధికారులు మీన మేషాలు లెక్కించడం సరి కాదన్నారు. ఏఎస్‌డబ్ల్యూఓ నిరంతర పర్యవేక్షణ ఉంటే ఈ ఘటన జరిగేది కాదన్నారు. తప్పుడు నివేదిక ఇచ్చిన ఆయన్ను కాపాడేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయన్నారు. గురు ప్రసాద్‌ను సస్పెండ్ చేసి విచారణ చేయాలని, అప్పుడే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు.

హామీలు అమలుచేయాలి

కడప ఎడ్యుకేషన్: విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలు సాధించుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైందని ఆర్ఎస్‌పీ రాష్ట్ర కన్వీనర్ సుబ్బరాయుడు అన్నారు. కడపలో జరిగిన ఆర్ఎస్‌పీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విడిపోయి పదేళ్లయినా, విభజన హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. ఆంధ్ర ప్రదేశ్ సమగ్రంగా అభివృద్ధి కావాలంటే అత్యంత ప్రధానమైన ప్రత్యేక హోదా సాధించాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్రలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని కోరారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు, భరత్, నాగేంద్ర, గోపి, నరసింహ, హేమంత్ పాల్గొన్నారు.

క'న్నీటి' కష్టాలు!

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే తాగునీటిపైనా కక్ష సాధింపులు చేస్తోంది. అసలు ఎండ వేడిమి 40 సెంటీగ్రేడ్ డిగ్రీలకు చేరింది. దాహార్తి తీర్చుకునేందుకు నగర వాసులు అల్లాడుతున్నారు. అయితే అయిన వారికి ఆకుల్లో... కాని వారికి కంచాల్లో అన్న చందంగా ప్రభుత్వం అన్ని కాలనీలకు సకాలంలో నీరందిస్తూ.. గౌస్ నగర్, గంజి కుంటకాలనీ, భగవంత్ సింగ్ కాలనీ వాసులకు మాత్రం మొండి చేయి చూపుతోంది. వీరికి నీరు ఏమాత్రం చాలడం లేదు. ట్యాంకర్ల కోసం పడిగాపులు కాస్తున్నారు.

- రోజు రోజుకూ ముదురుతున్న ఎండలు
- తాగునీరందక మూడు కాలనీలకు కష్టాలు
- కక్ష సాధింపులేనంటున్న ప్రజలు



బిందెలతో నీరు తీసుకెళ్తున్న వ్యక్తి



గౌస్‌నగర్‌లోవాల్వ్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



గంజికుంట కాలనీలో తాగు నీటి కోసం మహిళల కష్టాలు

కడప సెవెన్‌రోడ్స్ : సార్వత్రిక ఎన్నికల్లో తాము టీడీపీకి ఓట్లు వేయలేదని కక్షగట్టిన ఆ పార్టీ నేతలు తమకు తాగునీటి సరఫరా విషయంలో పలు అవరోధాలు కల్పిస్తున్నారని కడప నగరం గంజికుంట, గౌస్ నగర్ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. పోలింగ్ రోజున బయటి వ్యక్తులు రాళ్లు రువ్వితే ఆ సంఘటనలు తమకు అంటగట్టి తాగునీటికి ఆటంకాలు కల్పించడం ఎంతవరకు సబబని ప్రశ్నిస్తున్నారు. పెన్నానదిలో కావాల్సినంత నీరు ఉంది. నగరంలోని మిగతా డివిజన్లలో రోజు మార్చి రోజు తాగునీరు సరఫరా చేస్తున్నారు. కానీ తమకు మాత్రం వారాల తరబడి నీటి సరఫరా చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎందుకు ఇలా జరుగుతోందని అడిగితే ఎవరూ సరైన సమాధానం చెప్పడం లేదంటున్నారు. ఈ రెండు ప్రాంతాల్లో అత్యధికం ముస్లిం కుటుంబాలే ఉన్నాయి. మట్టి రోడ్లు, మురికి కాలువల పక్కన అగ్గిపెట్టెల్లాంటి ఇరుకు ఇళ్లల్లో పిల్లాపాపలతో నరకప్రాయమైన జీవనం సాగిస్తున్నారు. అసలే ఎండలు మండిపోతున్నాయి. తాగేందుకు గుక్కెడు నీళ్లు లేకపోవడంతో నాలుక పిడచకొట్టుకుపోతోంది. వేసవిలో సహజంగానే నీటి వినియోగం ఎక్కువగా ఉంటోంది. పైగా ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే రంజాన్ మాసం నడుస్తోంది. తెల్లవారుజామునే లేచి వంటా వార్పు చేసుకోవాల్సి ఉంటుంది. ఒక్కపొద్దు ఉండేవారు నమాజుల కోసం స్నానం చేయాలంటే నీళ్లు ఉండడం లేదని ఆ ప్రాంత ప్రజలు అంటున్నారు. కార్పొరేషన్ అధికారులకు ఫోన్ చేస్తే నీటి సరఫరా విషయంలో సరైన సమాధానం ఇవ్వడం లేదని... నీళ్ల ట్యాంకర్లతో సరిపెడుతున్నారని మండిపడుతున్నారు. అరకొర ట్యాంకర్ల సరఫరాతో ఒక కుటుంబానికి రెండు, మూడు బిందెల నీళ్లు మాత్రమే దక్కుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఉన్న ఫరూఖ్ మసీదు వద్ద ఒక వాటర్ ప్లాంటు ఉందని.. అక్కడ వృథాగా వెళ్లే నీటిని విధిలేని పరిస్థితుల్లో తెచ్చుకుంటున్నామని ఇంకొందరు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. నగర పాలక సంస్థ అధికారులు ఇప్పటికైనా స్పందించి తమ తాగునీటి కష్టాలు తీర్చాలని కోరుతున్నారు. తమకు ట్యాంకర్లతో కాకుండా.. మిగతా డివిజన్ల మాదిరే పైపులైన్ల ద్వారా నీరు సరఫరా చేసే శాశ్వత పద్ధతి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వారం రోజులుగా నీటి సరఫరా లేదు



మాకు వారం రోజులుగా నీటి సరఫరా లేక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కొన్ని వీధులకు నీరు వస్తుంటే, మరిన్ని వీధులకు రావడం లేదు. పెన్నానదిలో పుష్కలంగా నీరు ప్రవహిస్తోంది. పైపులు సక్రమంగా లేకపోవడంతో రాలేదని అందరూ చెబుతున్నారు. గండి వాటర్ వర్క్స్ నుంచి నీటి సరఫరా గతంలో బాగానే జరిగేది. ఇప్పుడు లింగంపల్లి నుంచి ఇస్తున్నారు. మా కష్టాలు తీరడం లేదు.

- వలి, గౌస్‌నగర్, కడప

రంజాన్ మూడో రోజున వదిలారు



రంజాన్ మాసం ప్రారంభమైన మూడో రోజు మాకు నీళ్లు వచ్చాయి. ఆ తర్వాత ఇప్పటివరకూ రాలేదు. పక్కనున్న గౌస్ నగర్‌లో కొన్ని వీధులకు వస్తే, మరికొన్ని వీధులకు రావడం లేదు. అరకొరగా వచ్చే ట్యాంకర్ల నీటితోనే కాలం వెళ్లదీస్తున్నాం. ఆ నీరు ఏమాత్రం ఇంటి అవసరాలకు సరిపోక పలు ఇబ్బందులు పడుతున్నాం.

- రజియా పర్వీన్, గంజికుంట కాలనీ, కడప

పవిత్ర మాసంలో నీరు లేక ఇబ్బందులు



పవిత్ర రంజాన్ మాసం నడుస్తోంది. ప్రతిరోజూ ఒక్కపొద్దు ఉండాలంటే నమాజులు, స్నానాలకు నీరు ఎంతో అవసరం. తెల్లవారుజామునే లేచి వంటా వార్పు చేసుకోవాల్సి ఉంటుంది. కార్పొరేషన్ అధికారులు ట్యాంకరును పంపిస్తున్నారు సరే... ఎన్నాళ్లిలా వీధుల్లోకి వచ్చి పట్టుకోవాలి. ఆ నీళ్లు మా అవసరాలకు ఏమాత్రం సరిపోక చాలా అవస్థ పడుతున్నాం.

- నసీమున్, గంజికుంట కాలనీ, కడప

కుళాయిల ద్వారా నీరివ్వాలి



అందరిలాగే మా కాలనీకి కుళాయిల ద్వారా నీరు అందించే శాశ్వత పద్ధతిని ఏర్పాటు చేయాలి. నీళ్ల కోసం రాత్రంతా జాగారం చేయాల్సిన పరిస్థితి ఉంది. ట్యాంకర్లు వస్తాయి సరే.. షుగరు, బీపీ వంటి వ్యాధులున్న పరిస్థితి నరకప్రాయంగా ఉంది. చేసేదిలేక ఫరూఖ్ మసీదు వద్ద వృథా నీటిని తెచ్చుకుంటున్నాం.

- సాబీరున్, గంజికుంట కాలనీ, కడప

టీడీపీకి ఓట్లేయలేదనే కక్ష



సార్వత్రిక ఎన్నికల్లో ఈ ప్రాంత ప్రజలు టీడీపీకి ఓట్లు వేయలేదని తాగునీరు సరఫరాకు ఆటంకాలు కలిగిస్తూ అధికార పార్టీ నాయకులు కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారు. చిన్నచౌక్ ప్రాంతంలో రోజూ నీటి సరఫరా జరిగినా.. ఈ ప్రాంతానికి రావడం లేదు. ఓవర్‌హెడ్ ట్యాంకుకు పూర్తి స్థాయిలో నీరు నింపడం లేదు. వాల్వ్‌ను సగం మాత్రమే తిప్పి ఆరు గంటలపాటు నీరిచ్చామంటున్నారు. అయినా నీరందడం లేదు.

- జహీర్, కో ఆప్షన్ సభ్యుడు, వైఎస్సార్ సీపీ

అంబేడ్కర్ భవనం అభివృద్ధిపై నిర్లక్ష్యమా?

ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్



అంబేడ్కర్ భవనాన్ని పరిశీలిస్తున్న ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : కడప రిమ్స్ పరిధిలో నిర్మించిన అంబేడ్కర్ భవనం అభివృద్ధిపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్, అఖిల భారత అగ్రగామి మహిళా సమితి రాష్ట్ర అధ్యక్షురాలు కోటపాటి సుబ్బమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ భవనాన్ని బుధవారం వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ 2013లో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌లో నిర్మించిన భవనాన్ని ఇప్పటి వరకూ అభివృద్ధి చేయలేదన్నారు. భవనం చుట్టూ ముళ్ల కంపలు, అసాంఘిక కార్యక్రమాలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోట్ల రూపాయలతో భవనం నిర్మించి మున్సిపాలిటీ అధికారులకు అప్పజెబితే ఎందుకు పనులు ప్రారంభించలేదని ఆయన ప్రశ్నించారు. కలెక్టర్ చొరవ చూపి భవన నిర్మాణం పూర్తి చేయకపోతే ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అరుణకుమారి, నగిలి రాజేంద్రప్రసాద్, హరిత, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

క్షయ పరీక్షలు చేయించుకోవాలి



సీవైటీబీ పరీక్షలను ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

కడప రూరల్ : క్షయ మందులు వాడే వ్యక్తి ఇంటి వారంతా సీవై టీబీ పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. స్థానిక ఆర్‌కేనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఏర్పాటుచేసిన సీవైటీబీ పరీక్షలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఈ పరీక్ష చాలా చిన్నదని, 48 గంటల నుంచి 72 గంటలలోపు వ్యాధి నిర్ధారణ అవుతుందన్నారు. పాజిటివ్ వస్తే తప్పనిసరిగా మందులు వాడాలని, టీబీ ముక్త్ భారత్‌లో భాగంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ రవిబాబు, డీపీఎంఓ డాక్టర్ శశిభూషణ్, మలేరియా అధికారి మనోరమ, డెమో భారతి, ఐడీఎస్‌పీ ఖాజామొహిద్దీన్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి నిల్వ కుంటలు తవ్వుకోవాలి



మస్టర్ తనిఖీ చేస్తున్న డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి

కమలాపురం : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులందరూ తమ పొలంలో నీటి నిల్వ కుంటలు తవ్వుకోవాలని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని టి.చదిపిరాళ్ల గ్రామానికి చెందిన రైతులు రవీంద్రారెడ్డి, సాయిప్రసాద్‌రావు, గోపులాపురం రైతు అరుణకుమారి పొలాల్లో తవ్వుతున్న నీటి నిల్వ కుంటలను ఆయన పరిశీలించారు. అలాగే గోపులాపురం వెళ్లే దారిలో జరుగుతున్న కాల్వ పనులను పరిశీలించారు. మస్టర్ తనిఖీ చేసి హాజరు చెక్ చేశారు. అలాగే ఉపాధి హామీ ద్వారా నాటుకున్న చీనీ చెట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ఉపాధి హామీ ద్వారా ఉచితంగా తమ పొలాల్లో ఒక వైపు నీటి నిల్వ కుంటలను తవ్వ కోవాలన్నారు. తద్వారా నీరు నిల్వ ఉంటుందని, అలాగే ఆ నీటిని భూమిలోకి పంపి రీఛార్జ్ చేయవచ్చన్నారు. నీటి నిల్వ కుంటల్లో ఉన్న నీటిని అత్యవసర సమయాల్లో వాడుకోవచ్చన్నారు. ఎక్కువ మంది రైతులు తమ పొలాల్లో కుంటలు తవ్వుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతి, ఏపీఓ పార్థసారధి, జేఈ ఉపేంద్రారెడ్డి, టీఏలు మేరి, ఆదినారాయణ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయరాదు



టి.చదిపిరాళ్లలో రోడ్లను శుభ్రం చేస్తున్న హరిత రాయబారులు, ఎంపీడీఓ జ్యోతి

కమలాపురం : చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయరాదని ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని చదిపిరాళ్ల గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. హరిత రాయబారులతో కలసి ఆమె గ్రామంలోని పలు కాలనీల్లో రోడ్లపై ఉన్న చెత్తా చెదారాన్ని ఊడ్చివేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటిలోని చెత్తా చెదారాన్ని రోడ్లపై వేయరాదని, అలా వేస్తే రూ.200 జరిమాన విధిస్తామన్నారు. పంచాయతీ అధికారులు పంపిణీ చేసిన డస్ట్‌బిన్‌లలో తడి, పొడి చెత్తను వేరు వేరుగా ఉంచాలన్నారు. హరిత రాయబారులు మీ ఇంటికి వచ్చి చెత్తను సేకరిస్తారని వివరించారు. అలాగే ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తద్వారా గ్రామం పరిశుభ్రంగా ఉంచడంతో పాటు చెత్త నుంచి సంపద సృష్టించవచ్చన్నారు. తద్వారా పంచాయతీ అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం పంచాయతీలో 30 సిమెంట్ చెత్త కుండీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగరత్నమ్మ, ఈఓపీఆర్‌డీ కెజియా, పంచాయతీ సెక్రటరీ పెంచలయ్య, హరిత రాయబారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఇన్విజిలేటర్ సస్పెన్షన్

పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్ తెచ్చుకున్నందుకు విద్యార్థి డీబార్

కడప ఎడ్యుకేషన్ : కడప ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో పరీక్షల విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇన్విజిలేటర్ ప్రకాష్‌బాబును సస్పెండ్ చేసినట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. పెండ్లిమర్రి మండలం జేసీ.పల్లె హైస్కూల్లో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ప్రకాష్‌బాబును కడప ప్రభుత్వ బాలికల హైస్కూల్ కేంద్రంలో పరీక్షల విధులకు నియమించారు. ఈ కేంద్రంలో ఒక విద్యార్థి సెల్‌ఫోన్‌ను జేబులో ఉంచుకుని కేంద్రంలోకి వెళ్లినా.. ఆ విషయాన్ని పరిశీలించకుండా పరీక్షకు అనుమతించారు. అదే సమయంలో ఈకేంద్రానికి తనిఖీకి వచ్చిన స్క్వాడ్ బృందం విద్యార్థి జేబులో సెల్‌ఫోన్ ఉండటాన్ని గుర్తించారు. విద్యార్థిని డీబార్ చేసి.. ఆ విషయాన్ని డీఈఓ దృష్టికి తీసుకువచ్చారు. విచారణ అనంతరం విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ప్రకాష్‌బాబును సస్పెండ్ చేస్తున్నట్లు డీఈఓ తెలిపారు.

యువతకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: డీడీయూ జీకేవై ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, జూనియర్ సాఫ్ట్‌వేర్ వెబ్ డెవలపర్, బ్యూటీషియన్ కోర్సుల్లో నాలుగు నెలలపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నామని అడ్మిషన్స్ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 18–35 ఏళ్లలోపు కలిగి టెన్త్ ఉత్తీర్ణులై ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. కడప నగరంలోని నిహార్ స్కిల్ సెంటర్‌లో శిక్షణ ఇస్తామన్నారు. ఈనెల 24 నుంచి బ్యాచ్‌ను ప్రారంభిస్తున్నామని, ఇతర వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

వల్లూరు : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిపై గోటూరు పెట్రోల్ బంకు సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు కడపకు చెందిన జావీద్ మరొక వ్యక్తితో కలిసి వల్లూరు వైపు నుండి కడప వైపుకు ప్రయాణిస్తున్న మోటారు బైక్, కమలాపురంకు చెందిన సాదక్ కడప నుండి కమలాపురం వైపుకు ప్రయాణిస్తున్న మరో మోటార్ బైక్ గోటూరు పెట్రోల్ బంకు సమీపంలో ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దీంతో సాదక్, జావీద్‌లు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం వారిని 108 వాహనం ద్వారా కడప రిమ్స్‌కు తరలించారు.

పరామర్శ



సీకేదిన్నె పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పరామర్శిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : కమలాపురం మండలం పాచికలపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గోవిందు విజయేంద్రారెడ్డిని సీకేదిన్నె పోలీస్‌స్టేషన్‌లో బుధవారం వైఎస్ఆర్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి పరామర్శించారు. చింతకొమ్మదిన్నె పోలీసులు ఓ హత్యాయత్నం కేసులో విజయేంద్రారెడ్డిని అక్రమంగా చేర్చి అదుపులోకి తీసుకున్నారు. బుసిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన గజ్జల మల్లికార్జునరెడ్డి వ్యక్తిపై జరిగిన హత్యాయత్నం కేసుకు సంబంధించి నమోదైన క్రైం నెంబర్ 14/2024 తేదీ 29/01/2024 కేసులో గోవిందు విజయేంద్రారెడ్డి(36)ని బుధవారం అరెస్ట్ చేసి రిమాండుకు పంపినట్లు సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు.

వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించాలి



చిన్నారి బరువును పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : తల్లిదండ్రులు తమ బిడ్డలకు నిర్ణీత కాల వ్యవధిలో నిరోధక టీకా వేయించాలని హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్న లత సూచించారు. కడప నాగరాజుపేట అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్ అంగన్వాడీ సెంటర్‌లో ఆమె తనిఖీ చేశారు. టీకా, డ్యూలిస్ట్, స్కూల్ హెల్త్, కార్యక్రమం, అసంక్రమిత వ్యాధుల సర్వే కార్యక్రమంపై ఆరా తీశారు. రికార్డులు, ఆన్‌లైన్ రిపోర్టులు తనిఖీచేసి తగిన సలహాలు, సూచనలిచ్చారు. వ్యాధి నిరోధక టీకా ఇప్పించడంతో 13 ప్రాణాంతక వ్యాధులు రాకుండా చిన్నారులను కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డాక్టర్స్ డాక్టర్ నవీన్, డాక్టర్ జుమ్నా, డాక్టర్ మహమ్మద్, ఏఎన్ఎం లలిత, అంగన్వాడీ టీచర్ నాగవేణి పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరాలి



మాట్లాడుతున్న జడ్జి బాబాఫకృద్దీన్

కడప ఎడ్యుకేషన్ : లక్ష్య సాధనకు అంధత్వం అడ్డురాదని, కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ జడ్జి బాబా ఫకృద్దీన్ సూచించారు. కడప సమీపంలోని శంకరాపురం అంధుల పాఠశాలలో ప్రాంతీయ బాషలో బ్రెయిలీ సాధన అంశంపై బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా బాబా ఫకృద్దీన్ మాట్లాడుతూ సుకన్య పుస్తకాలు దృష్టి లోపాలు మరియు ఇతర ప్రింట్ వైకల్యా లున్న వ్యక్తుల కోసం రూపొందించారన్నారు. అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ లైబ్రరీని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. లీస్ రీడింగ్ మెటీరియల్, స్క్రీన్ రీడర్లు, బ్రెయిలీ డీస్సీ, ఆడియో ఫార్మెట్లు, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100 నల్సా పథకాల గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు క్రిష్ణ కిషోర్, ఎబినేజర్, రాజు, నరసింహులు పాల్గొన్నారు.


లక్ష్య సాధనకు కృషి ఎంతో అవసరం



మాట్లాడుతున్న చందు

కడప ఎడ్యుకేషన్ : లక్ష్య సాధనకు విద్యార్థులు కృషి చేయాలని స్టేట్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ చందు పేర్కొన్నారు. కడప శిల్పారామం వేదికగా శ్రీహరి డిగ్రీ కళాశాల(స్వయం ప్రతిపత్తి) 15వ వార్షికోత్సవ వేడుకను బుధవారం ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్స్ జి. సుబ్బారెడ్డి, విజయభారతి ఆధ్వర్యంలో కళాశాలలో జరిగిన కార్యక్రమంలో చందు మాట్లాడుతూ ఎంబీబీఎస్‌లో సీటు వచ్చినా కొన్ని కారణాలతో చేరలేకపోయానన్నారు. చదివిన కళాశాలకే అతిథిగా రావడం సంతోషంగా ఉందన్నారు. విజయం విద్యా సంస్థల అధినేత తేజోమూర్తి, అర్చన డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ మదన్‌మోహన్‌రెడ్డి, సీఎస్ఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి డిగ్రీ మొదటి సంవత్సరం నుంచే లక్ష్యం ఎంచుకుని విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్‌తో ప్రజల భద్రతకు భరోసా



నగరంలో పర్యటిస్తున్న సీఐ, సిబ్బంది

కడప అర్బన్ : విజిబుల్ పోలీసింగ్‌తో ప్రజల భద్రతకు భరోసా కలుగుతుందని సీఐలు నాగార్జున, జావేద్, రామకృష్ణ అన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు వారు వేర్వేరు ప్రాంతాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. వాహనాలు తనిఖీ చేసి రోడ్డు భద్రతపై వివరించారు. వారు మాటాల్డుతూ ద్విచక్ర వాహనం నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కారు డ్రైవర్లు సీట్‌బెల్టు వేసుకోవాలన్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, మద్యం తాగి డ్రైవింగ్ చేయరాదని, పరిమితికి మించి ఆటోల్లో తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం నగరంలోని వివిధ కూడళ్లు, రహదారులలో కలియదిరిగి ప్రజా రక్షణ కోసం తామున్నామంటూ భరోసా కల్పించారు.

మాదక ద్రవ్యాలను పూర్తిగా నిర్మూలిద్దాం



మాట్లాడుతున్న ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి

చింతకొమ్మదిన్నె: మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలిద్దాం అని స్థానిక అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి తెలిపారు. సమాజంలో యువత మత్తుకు అలవాటుపడి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారన్నారు. చిన్నచిన్న పరిశ్రమలలో పనిచేసే కార్మికులు, కూలీలు వీటికి అలవాటు పడి కుటుంబాలు కూడా చిన్నాభిన్నం అయ్యే పరిస్థితులు దాపరిస్తున్నాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యే శ్రద్ధచూపాలన్నారు. సీఐ శివశంకర్ నాయక్ మాట్లాడుతూ పలువురు మత్తు పదార్థాలకు అలవాటు పడి, డబ్బుల కోసం నేరాలు, హత్యలకు సైతం పాల్పడుతున్నారన్నారు. కళాశాల సమీప ప్రాంతాలలో ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారన్న సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. గంజాయి ఎక్కడెక్కడ ఉందో వాటి మూలాలకు వెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సుధాకరరెడ్డి, హెచ్ఓడీ కె.ఎస్.శశికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.